## క్లుప్తంగా

### అబ్బాస్ దర్గాలో ప్రశాంత్‌రెడ్డి ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ప్రశాంత్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం:** ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆదివారం నల్గొండ జిల్లా చింతపల్లి మండలం పీకే మల్లెపల్లిలోని హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్‌ను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థల సమీపంలో హిట్టర్స్ బాక్స్ క్రికెట్‌ను ఆయన ప్రారంభించారు. ఆన్‌లైన్ గేమ్‌లు తగ్గించి క్రీడాస్ఫూర్తితో వివిధ క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు.

### నూతన నియామకం



విజయ్‌కుమార్

**మంచాల:** మంచాల మండల కుమ్మరి యువజన సంఘం అధ్యక్షుడిగా మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన చిలుకూరి విజయ్‌కుమార్‌ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు కాసుల పాండు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కుమ్మరి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషిచేయాలన్నారు. యువతను చైతన్యపర్చి రాజ్యాంగ బద్ధంగా హక్కుల సాధన దిశగా ఉద్యమించాలన్నారు. అదే విధంగా రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### కృష్ణయ్యయాదవ్ సేవలు చిరస్మరణీయం



కృష్ణయ్యయాదవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**కడ్తాల్:** నాటు వైద్యుడు మర్ల కృష్ణయ్యయాదవ్ సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన సేవలను కొనియాడారు. ఆదివారం మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో మర్ల కృష్ణయ్యయాదవ్ సంతాప సభ నిర్వహించారు. పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని మర్ల కృష్ణయ్యయాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు బాలరాజు, చంద్రునాయక్, ఆశోక్ ఉన్నారు.

### అవినీతి పాలనకు చరమగీతం పాడుదాం

**జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యుడు జంగయ్య**

**తలకొండపల్లి:** రాష్ట్రంలోని అవినీతి ప్రభుత్వానికి చరమగీతం పాడుదామని జిల్లా ఓబీసీ కార్యవర్గ సభ్యుడు గుండ్రాతి జంగయ్య అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. మండల పరిధిలోని గట్టుప్పలపల్లిలో ఓబీసీ మండలాధ్యక్షుడు దేరంగుల విజయ్ ఆధ్వర్యంలో ఆదివారం పల్లె పల్లెకు ఓబీసీ–ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు పంపిణీ చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అధిక సీట్లు గెలుచుకొని కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురువేస్తామన్నారు. కార్యక్రమంలో దళితమోర్చా మండలాధ్యక్షుడు రాజు, బూత్ కమిటీ అధ్యక్షుడు పవన్, రాజశేఖర్, యాదగిరి, జగత్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, శివ, అంజి, సురేష్, భాను, భరత్, ఇమ్మిడి మహేష్ పాల్గొన్నారు.

### శ్రీరమణకాలనీ ఫేజ్-2 నూతన కార్యవర్గం ఎన్నిక

**హస్తినాపురం:** హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణకాలనీ సంక్షేమ సంఘం ఫేజ్–2 నూతన కార్యవర్గాన్ని ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగాప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంతోష్‌కీర్తి, ఉపాధ్యక్షులుగా కొండల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్‌గౌడ్, అమర్‌నాథ్‌రెడ్డి, కోశాధికారిగా గురునాథ్‌రెడ్డి లను కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### 'సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా'

**హయత్‌నగర్:** డివిజన్‌లోని కట్టమైసమ్మ కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన కట్టమైసమ్మ కాలనీని సందర్శించారు. కాలనీలో అంతర్గత డ్రైనేజీ, సీసీ రోడ్ల, వీధి దీపాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, వర్షాకాలం పూర్తిగా రోడ్లు బురదమయంగా మారుతున్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు.

# సమస్యల తిష్ట



విద్యానగర్ కాలనీలో ఓ ఇంటిపక్కన నిలిచిన మురుగు

- విద్యానగర్ కాలనీలో మౌలిక వసతులు కరువు
- రోడ్లపై పారుతున్న మురుగు, సీసీ రోడ్లు ధ్వంసం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



మురుగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీలో వసతుల లేమితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా వెలసిన కాలనీల్లో మౌలికవ వసతుల కల్పనలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. కాలనీల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్లు, వీధి దీపాలు లేక అవస్థలు పడుతున్నారు. విద్యానగర్ కాలనీలో మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తుంది. పలుచోట్ల ఇళ్లమధ్య మురుగు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. మురుగు నిల్వ ఉండటంతో ఈగలు, దోమలు, పందుల బెడద అధికమైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో వీధిదీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్లు నిర్మించాలని ఎప్పటి నుంచో కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇళ్లమధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరగడంతో పాములు వస్తున్నాయని భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. కాలనీలోని పలు ఇళ్లపైనుంచి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

**పలుమార్లు ఫిర్యాదు చేసినా..**

విద్యానగర్ కాలనీలో మొదటిసారిగా కాలనీ సంక్షేమ సంఘం కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కాలనీకి చెందిన లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషాను ఎన్నుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం నుంచి.. మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులు, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డిని కలిసి వినతిపత్రాలు అందించారు.

**ఎమ్మెల్యే దత్తత తీసుకున్నా..**

విద్యానగర్ కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను ఇటీవల కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ స్వయంగా పరిశీలించారు. కాలనీ సంక్షేమ సంఘం కోరిక మేరకు కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే కాలనీని తాను దత్తత తీసుకున్నారు. ప్రత్యేక నిధులు తీసుకువచ్చి వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ ఇంతవరకు కాలనీలో ఒక్క సమస్యకు కూడా పరిష్కారం చూపలేదని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### మురుగు నిలుస్తోంది



నేను విద్యానగర్ కాలనీలో ఉంటాను. మా ఇంటి పక్కన మురుగు నిలిచిఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. మురుగు పోవడానికి వీలుగా కాలువ నిర్మించాలని మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారుల చుట్టూ తిరిగితిరిగి అలసిపోయాను. ఎలాంటి స్పందన లేదు. ఉన్నతాధికారులు స్పందించి మురుగు తొలగించాలి.

– బాలయ్య, విద్యానగర్ కాలనీ

### సమస్యలు పరిష్కరించాలి



విద్యానగర్ కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలి. ఇళ్ల మధ్యే నీరు నిలుస్తుంది. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దత్తత తీసుకున్న కాలనీలో సమస్యలు అలాగే ఉన్నాయి. ఉన్నతాధికారులతో చర్చించి వెంటనే సమస్యలు పరిష్కరించాలి.

– పాషా, విద్యానగర్ కాలనీ అధ్యక్షుడు

# నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

**జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్**

**తలకొండపల్లి:** మండల పరిధిలోని తాళ్లగుట్టతండాలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని జెడ్పీటీసీ, ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆదివారం ప్రారంభించారు. ట్రస్టు ఆధ్వర్యంలో రక్షిత మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందిస్తామన్నారు. తండాలో అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి జెడ్పీటీసీ నిధుల నుంచి రూ.3 లక్షలు అందజేస్తామన్నారు. అదేవిధంగా ఎడవల్లి గ్రామంలో జెడ్పీటీసీ పర్యటించారు. ట్రస్టు ద్వారా 20 మంది నిరుపేదల ఇండ్లను నిర్మిస్తానని ప్రకటించారు. గ్రామంలో ట్రస్టు ద్వారా నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని భరోసా పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, సర్పంచ్‌లు కిష్టమ్మ, లక్ష్మణ్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, శ్రీశైలంగౌడ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, లింగయ్య, మల్లేష్, లింగయ్య, కుమార్, కృష్ణ, వెంకటేశ్, తిరుపతి, పాండు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్

**చింతపల్లిగూడలో..**

**ఇబ్రహీంపట్నం రూరల్:** పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆదిబట్ల మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని చింతపల్లిగూడలో రూ.లక్ష సొంత నిధులతో వాటర్ ఫిల్టర్ నిర్మాణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈమేరకు లక్ష రూపాయల నగదును కౌన్సిలర్‌కు అందజేశారు. స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం




జెడ్పీహెచ్ఎస్ 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం:** పొల్కంపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని వీకే కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం అంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. సుమారు 23 సంవత్సరాల అనంతరం వారంతా ఒక్కచోట చేరి ఆనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. యోగాక్షేమాలు తెలుసుకున్నారు. ఎవ్వరికి ఏ ఆపద వచ్చినా ఒకరికొకరు అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నెల్సన్, జగన్‌రెడ్డి, బాల్‌రాజ్, శేఖర్, పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, వెంకటేశ్, సత్యనారాయణ, అశోక్, రాజు, సరస్వతి, అనిత, పల్లవి, రజిత పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు చేస్తే అడ్డుకుంటాం

**మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి**



**యాచారం:** రాష్ట్ర ప్రభుత్వం యాచారం మండల కేంద్రంలో మళ్లీ డంపింగ్ యార్డు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోందని, తాజాగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలే దీనికి నిదర్శనమని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి ఆరోపించారు. యాచారం మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ సర్కార్ యాచారం మండలంలో ఫార్మాసిటీ, మైనింగ్ జోన్, తాజాగా మళ్లీ డంపింగ్ యార్డు ఏర్పాటుకు సన్నాహాలు చేయడం సరైంది కాదని మండిపడ్డారు. మండలంలో మైనింగ్ జోన్, డంపింగ్ యార్డు ఏర్పాటును రద్దు చేయించే విధంగా స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సంబంధిత అధికారులతో ఆదేశాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సర్కార్ వచ్చిన కొత్తలో యాచారం మండల కేంద్రంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు నిర్ణయిస్తే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్రంగా వ్యతిరేకిస్తే వెనక్కి తగ్గినట్లు తెలిపారు. తాజాగా ప్రభుత్వ పెద్దల అండతో మళ్లీ డంపింగ్ యార్డు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. మహా నగరానికి దగ్గరలో ఉన్న యాచారంలో కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రైతులు తమ వ్యవసాయ పొలాలను కాలుష్యం వెదజల్లే పరిశ్రమలకు ఇచ్చి ప్రాణాలు తీసుకోవాలా అంటు ప్రశ్నించారు. డంపింగ్ యార్డు రద్దు కోసం త్వరలో ఉన్నతాధికారులకు కలుస్తానని అన్నారు. ఫార్మాసిటీలో భూసేకరణ, పరిహారం చెల్లింపులో అనేక అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వాటిపై పోరాడుతామన్నారు. రైతులకు కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందన్నారు.

### ఆర్థికసాయం అందజేత

**తలకొండపల్లి:** మండల కేంద్రానికి చెందిన పోతుగంటి లింగమ్మ(63) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం బీజేపీ జిల్లా కార్యదర్శి శానమోని పాండు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. జాతీయ బీసీ కమిషన్ మాజి సభ్యుడు తల్లోజు ఆచారి పిలుపు మేరకు బాధిత కుటుంబ సభ్యులకు పాండు 50 కిలోల బియ్యం, నగదు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం కార్యవర్గ సభ్యులు మహేశ్, రమేష్, మైసయ్య, చంద్రయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

**ఆమనగల్లు:** హైదరాబాద్‌లో అంబేద్కర్ భారీ విగ్రహం ఏర్పాటు చేసినందుకు గాను ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం బీఆర్ఎస్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ప్రతిష్ఠించి సీఎం కేసీఆర్ మరోసారి దళిత బాంధవుడుగా గుర్తింపు తెచ్చుకున్నారని ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ కన్వీనర్ పత్యానాయక్ అన్నారు.అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చుక్క నిరంజన్‌గౌడ్, రామకృష్ణ, సయ్యద్ ఖలీల్, లండం యాదయ్య, భీమయ్య, రమేశ్, గుత్తి బాలస్వామి, వస్పుల సాయిలు, మల్లేశ్, అల్లాజీ, కిరణ్, పరమేశ్, ఆనంద్, అరుణ్, యాదగిరి, రంజిత్, అప్రోచ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# భూదేవి సమేత వేంకటేశ్వర కల్యాణం



కల్యాణోత్సవంలోని ఓ ఘట్టం



హాజరైన భక్తులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో ఘనంగా జరిగింది. జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణతో వేడుకలు జరిగాయి. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ లక్ష్మారెడ్డి, తెలంగాణ లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బూడిద నందారెడ్డి , చలమల కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, గ్రామస్తులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు .

# ప్రాచీన కళలను ప్రోత్సహిద్దాం

**కడ్తాల్:** కనుమరుగువుతున్న ప్రాచీన కళలకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించి వాటిని వెలుగులోకి తేవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో కళాకారులు ప్రదర్శించనున్న శ్రీ వేంకటేశ్వర మహాత్యం, శ్రీనివాస పద్మావతి కల్యాణం నాటక ప్రదర్శనకు ప్రోత్సాహకంగా రూ.5వేలను కళాకారులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు బాలకిషన్, రాములుగౌడ్, చెన్నయ్య, నారాయణరెడ్డి, జంగయ్యగౌడ్, మహేశ్, తిరుపతిరెడ్డి, యాదయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరేందర్ తదితరులు ఉన్నారు.



### 244వ రోజుకు చేరిన ధర్నా

**అబ్దుల్లాపూర్‌మెట్:** మండల పరిధిలోని బండరావిరాల గ్రామంలో ఏర్పాటు చేసిన మైనింగ్‌జోన్‌ను రద్దుచేయడంతో పాటు సర్వేనం 268లో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సద్దుపల్లి కూడలిలో బండరావిరాల, చిన్న రావిరాల గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులు, వారి కుటుంబాలు చేపడుతున్న ధర్నా ఆదివారం నాటికి 244వ రోజుకు చేరింది. తమ ప్రాణాలకు హాని కల్గించే మైనింగ్ జోన్‌ను రద్దు చేయాలని శాంతియుతంగా గత 244రోజులుగా ధర్నా చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని భూ నిర్వాసిత రైతులు ఆరోపించారు. మా నుంచి లాక్కున్న భూములను మాకే ఇవ్వాలి అన్నారు. మాకు న్యాయం జరిగే వరకూ క్రషర్లు పనిచేయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

# ముగిసిన ఆదిబట్ల ప్రీమియర్ లీగ్

**ఇబ్రహీంపట్నం రూరల్:** క్రీడలు శరీర ధారుడ్యానికి ఎంతగానో దోహదపడతాయని ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ భూపతిగళ్ల మహిపాల్ పేర్కొన్నారు. గత రెండు నెలలుగా ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఆదిబట్ల ప్రీమియర్ లీగ్ 6వ ఎడిషన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. క్రీడలకు స్పాన్సర్‌గా ఈసీ శేఖర్‌గౌడ్ నిలవగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ భూపతిగళ్ల మహిపాల్ ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు అందజేశారు. ఇలాంటి టోర్నమెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి దోహదపడతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, జంగయ్య, రజినీకాంత్, శ్రవీణ్‌గౌడ్, దర్శణ్‌గౌడ్, శ్రీహరి, రాజేష్, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ మహిపాల్

# పొంచి ఉన్న ప్రమాదం

**జాతీయ రహదారిపై ఒరిగిన విద్యుత్ స్తంభాలు**



పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఒరిగిన స్తంభం

**అబ్దుల్లాపూర్‌మెట్:** నిత్యం రద్దీగా ఉండే విజయవాడ జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ నిర్వహణా లోపం కారణంగా ప్రమాదకరంగా మారాయి. పెద్దఅంబర్‌పేట నుంచి కొత్తగూడెం వరకూ ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్ స్తంభాల్లో కొన్ని ఒకవైపుకు ఒరిగిపోయి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వాహనాలు ఢీకొన్న సమయంలో స్థంభాలు విరిగిపోవడం లేదా ఒరిగిపోవడం జరుగుతుండగా వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కొన్ని స్థంభాలు ప్రమాదకరంగా మారాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. దగ్గరకు వచ్చేంత వరకూ స్థంభాలు కనిపించడం లేదని, ఒరిగిన స్థంభాల వల్ల పెద్ద ప్రమాదాలు జరిగే వరకూ అధికారులు చర్యలు చేపట్టరా అని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదకరంగామారిన సెంట్రల్ లైటింగ్ స్థంభాలను అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

# నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

**హయత్‌నగర్:** నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఆదివారం కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ పాఠశాల నుంచి జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగమల్ల దర్శన్‌గౌడ్ మాట్లాడుతూ... 2004 సెప్టెంబర్ తర్వాత ఉద్యోగాలలో చేరిన వారికి పెన్షన్ స్కీం వర్తించకుండా ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తర్వాత ఎలాంటి ఆదాయం లేకుండా పోతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తాహెర్‌అలీ, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు కమలాకర్, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అవినీతి పాలన అంతం

- టీపీసీసీ కార్యదర్శి రాంరెడ్డి
- పార్టీలో పలువురి చేరిక

**మంచాల:** దేశంలో, రాష్ట్రంలో అవినీతి పాలన అంతం కావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి అన్నారు. ఆదివారం దండెం రాంరెడ్డి ఆధ్వర్యంలో మంచాల మండలంలోని సత్తి తండా, లోయపల్లి, బోడకొండ, ఎల్లమ్మ తండా, పటేల్ చెరువు తండా, ఆరుట్ల గ్రామాల నుంచి సుమారు 250 మందికి పైగా వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆయన స్వాగతం పలికారు. మంచాల గ్రామం నుంచి దండేటికార్ ఫంక్షన్‌హాల్ వరకు పెద్దఎత్తున ర్యాలీ తీశారు. కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కేసీఆర్ సర్కార్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ముత్తయ్య, రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి గుండ్ల వెంకట్‌రెడ్డి, రంగారెడ్డిజిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు హతిరాం, సంతోష్ గౌడ్, నాయకులు వెంకటేష్, సురేష్, రాము, పాపజీ, శ్రీకాంత్, బుగ్గరాములు, అశోక్, గోపాల్, నవీన్, సిద్దు, రాంబాబు, యువకులు పాల్గొన్నారు.

**రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..**

**ఇబ్రహీంపట్నం రూరల్:** తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి అనుబంధ గ్రామం ఎన్గల్‌గూడకు చెందిన ఉషగల్ల వెంకటేష్, ఈరపటన్నం యాదగిరి, మనగనూరి శంకర్, ఈ .శ్రీను, మాచర్ల స్వామి, గువ్వల చంటి, మనగనూరి సురేందర్, మాచర్ల అనిల్, ఎం.శేఖర్, మధు.. మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులువెంకటేష్, అశోక్, శ్రీనివాస్, రవి, శివప్రసాద్ పాల్గొన్నారు.



మంచాల: రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన యువకులు

**ఫార్మాను రద్దు చేస్తాం..**

**యాచారం:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, రైతుల అంగీకారం మేరకు కాలుష్యం లేని పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకే ఉపాధి కల్పిస్తామని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. కుర్మిద్ద, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, నందివనపర్తి గ్రామాల రైతులు ఆదివారం నగరంలోని మాజీ ఎమ్మెల్యేను కలిసి ఫార్మాసిటీ భూసేకరణలోని ఇబ్బందులు, ఓంకారేశ్వరాలయ భూములను టీఎస్ఐఐసీ తీసుకుంటుండటంపై తెలియజేసి అండగా ఉండాలని రైతులు విజ్ఞప్తి చేశారు. మల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తరఫున రైతులకు అండగా ఉంటామన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ మోటె శ్రీశైలం, నాయకుల మంకాల దాసు, వరికుప్పల సుధాకార్, మల్లేష్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.